మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

బుధవారం 22-10-2025
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 8

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609




## ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులే




### సమాజంలో శాంతిభద్రతలతోనే పెట్టుబడుల రాక

- విధి నిర్వహణ కోసం ఎందరో కుటుంబాలకు దూరం
- పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల కఠిన వైఖరి
- ఈగిల్, శక్తి విభాగాల ఏర్పాటుతో ఆధునికంగా పోలీస్ శాఖ
- డ్రగ్స్,గంజాయి, ఎర్రచందనం ముఠాల ఆటకట్టేల కృషి
- పోలీస్ అమరుల దినోత్సవం సందర్భంగా చంద్రబాబు నివాళి

**అమరావతి,**

ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులేనని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విధి నిర్వహణ కారణంగా తమ కుటుంబంతో సరిగా గడపలేని పరిస్థితి వారిదని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సీఎం నివాళులర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి మాట్లాడారు. 1959 అక్టోబర్ 21న మన సీఆర్‌పీఎఫ్ దళాలు వీరోచిత పోరాటం చేశాయి. చైనా సైనికులపై పోరాడి 10 మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారు.

-మిగతా 3 లో







## మహిళా సాధికారతకు చంద్రబాబు కృషి

- శక్తి యాప్‌తో మహిళల భద్రతకు పెద్దపీట
- పోలీస్ అమరవీరుల సంస్మరణలో హోంమంత్రి అనిత

**అమరావతి**

మహిళా సాధికారత, రక్షణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అందులో భాగంగా శక్తి యాప్‌ను తీసుకు వచ్చామన్నారు. మంగళవారం పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమర వీరులకు హోం మంత్రి అనిత ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఆపరేషన్ సేఫ్ పేరిట విద్యార్థుల్లో అవగాహన

-మిగతా 3 లో



## ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

- ఆయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి
- ప్రజలకు దీపావళి శుభాకాంక్షల్లో మోడీ ప్రస్తావన

**న్యూఢిల్లీ,**

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల

-మిగతా 3 లో

### అసాంఘిక కార్యకలాపాలకు అండగా

## భీమవరం డీఎస్పీ

### భీమవరం డీఎస్పీ జయసూర్యపై నివేదిక

- తరచూ సివిల్ వివాదాల్లో తలదూర్చడంపై ఆగ్రహం
- ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిని డిప్యూటి సీఎం పవన్

**అమరావతి,**

భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారాలపై పశ్చిమ గోదావరి ఎస్పీతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్చించారు. సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్న డిఎస్పీపై నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆదేశించారు. డీఎస్పీ జయసూర్యపై పవన్ కళ్యాణ్‌కు తరచూ ఫిర్యాదులు వెళ్లాయి. పేకాట శిబిరాలు పెరిగిపోయాయని, సివిల్ వివాదాలలో జయసూర్య జోక్యం చేసుకొంటున్నారని, కొందరి పక్షం వహిస్తూ కూటమి నేతల పేరు వాడుతున్నట్లు పవన్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశంపై వెంటనే చర్యలు ఉపక్రమించారు పవన్. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో దీనిపై ఫోన్‌లో చర్చించారు. డీఎస్పీకి సంబంధించిన వ్యవహారంపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ జయసూర్యపై వచ్చిన

-మిగతా 3 లో



## నేటి నుంచి చంద్రబాబు దుబాయ్ పర్యటన

- మూడ్రోజులపాటు పారిశ్రామికవేత్తలతో భేటీ
- విశాఖ సిఐఐ సదస్సుకు స్వయంగా ఆహ్వానం



**అమరావతి,**

నేటినుంచి మూడు రోజుల పాటు యూఏఈలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. పెట్టుబడుల సాధన కోసం యూఏఈలో ముఖ్యమంత్రి బృందం పర్యటన చేపట్టనుంది. వచ్చే నెల 14-15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పార్టనర్షిప్ సమ్మిట్‌కు వివిధ సంస్థల ప్రతినిధులను చంద్రబాబు స్వయంగా

-మిగతా 3 లో

## వేడెక్కిన జూబ్లీహిల్స్ ప్రచారం

- దీపక్ రెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రుల ప్రచారం
- జూబ్లీహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అన్న బండి సంజయ్




**హైదరాబాద్,**

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కింది. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను విమర్శించారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. ఏయ్ బిడ్డా? జూబ్లిహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అంటూ ప్రారంభించిన ఆయన.. కిషన్ రెడ్డి నాయకత్వంలో

-మిగతా 3 లో



## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకాయిచి

- ఎన్నుకున్న జపాన్ పార్లమెంట్

**టోక్యో,**

జపాన్ తొలి మహిళా ప్రధానిగా అతివాద నేతగా పేరున్న సనే తకైచి ఎన్నికయ్యారు. జపాన్ పార్లమెంట్ మంగళవారం దేశంలోని తొలి మహిళా ప్రధానమంత్రిగా సనే తకైచికి ఎన్నుకుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ- జపాన్ ఇన్నోవేషన్ పార్టీ కూటమితో.. తకైచికి భారీ మద్దతు లభించింది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించారు. 64 ఏళ్ల తకైచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో

-మిగతా 3 లో

## చైనాకు ట్రంప్ వార్నింగ్

- అప్పటిలోగా ఒప్పందం చేసుకోండి.
- లేదంటే 155 శాతం సుంకాలు విధిస్తా..



**వాషింగ్టన్ -**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల బెదిరింపులకు దిగారు. రష్యాతో చమురు వ్యాపారం ముగించకుంటే భారత్ భారీగా సుంకాలు చెల్లించాల్సి వస్తుందన్న ట్రంప్.. తాజాగా చైనాను హెచ్చరించారు. నవంబర్ 1వ తేదీ లోగా అమెరికాతో న్యాయమైన వాణిజ్య ఒప్పందం కుర్చుకోకపోతే బీజింగ్‌పై సుంకాలు 155 శాతానికి పెంచుతానంటూ వార్నింగ్ ఇచ్చారు. చైనాకు అమెరికాపై అపార గౌరవ ఉందని, అందుకే ఎక్కువ టారిఫ్‌లు చెల్లిస్తున్నదంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. అమెరికా.. ఆస్ట్రేలియాతో 8.5 బిలియన్ డాలర్ల అరుదైన ఖరిజాల ఒప్పందం కుదుర్చుకున్నది. సోమవారం ఆ దేశ ప్రధాని ఆంటోనీ అల్బనీస్‌తో వైట్‌హౌస్‌లో భేటీ అయిన ట్రంప్.. ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చైనా ఇప్పటికే 55 శాతం సుంకాలు చెల్లిస్తున్నది. జిన్‌పింగ్‌తో

-మిగతా 3 లో

## ప్రజలను, వ్యాపారులను బెదిరించడం పేర్ని లక్ష్యం

- ఏ వ్యాపారం లేకపోయినా కోట్లు ఎలా సంపాదించావ్
- నానిపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం,**

వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నీ నాని పై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. 'పేర్ని నానీ.. రెడ్ లైన్ దాటేశావ్... ఇక వదిలిపెట్టం. బందరు అభివృద్ధి చూసి ఓర్వలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నావు. నాడు ఆర్యవైశ్యులను వేధించి.. నేడు ఆర్యవైశ్యుల రాగం అందుకోవడం సిగ్గుచేటని రవీంద్ర విమర్శించారు. మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడిన మంత్రి.. వైసీపీ

-మిగతా 3 లో

## సుందర్ పిచాయ్ భారత్‌లో పెట్టుబడులు

- తమిళనాడు రచ్చపై ఎక్స్ వేదికగా లోకేశ్ స్పందన



**అమరావతి,**

గూగుల్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో వస్తున్న విమర్శలను మంత్రి లోకేశ్ తిప్పి కొట్టారు. గూగుల్ కంపెనీ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. కొద్దిరోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ వైజాగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైజాగ్‌ను అద్భుతమైన నగరం అంటూ ప్రశంసలు కురిపించారు. అయితే, ఏపీలో గూగుల్ కంపెనీ డేటా సెంటర్ ఏర్పాటు చేయటంపై తమిళనాడులో రచ్చ మొదలైంది. అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐఏడీఎంకేల మధ్య రచ్చ జరుగుతోంది. రెండు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. సుందర్ పిచాయ్ తమిళ వ్యక్తి అయినప్పటికీ గూగుల్ పెట్టుబడులను ఏపీలో పెడుతున్నాడని,

-మిగతా 3 లో

# దీపావళి ఎఫెక్ట్.. ఢిల్లీలో పడిపోయిన గాలి నాణ్యత

**ఢిల్లీ**

దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు పడిపోతున్నది. దీపావళి వేడుకల అనంతరం వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకున్నది. మంగళవారం ఉదయం 7 గంటల సమయానికి గాలి నాణ్యత సూచీ 347 పాయింటకలు పెరిగింది. దీంతో వెరీ పూర్ కేటగిరిలో గాలి నాణ్యత కొనసాగుతున్నది. ఇది చాలా ప్రమాదకరమని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ 491గా నమోదయింది. దీంతో ప్రజలు కళ్లు, ముక్కు, గొంతులో మంట, దురద సమస్యలు తలెత్తుతున్నాయి. మాస్క్ ధరించాలని, ఉదయం పూట ఆరుబయట తిరగవద్దని వైద్య నిపుణులు సూచించారు. కాగా, దీపావళి పటాకులు, వ్యవసాయ వ్యర్థాలు కాల్చడమే కాలుష్యానికి కారణమని పీసీబీ వెల్లడించింది. నిర్మాణ వ్యర్థాలు కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు తెలిపింది. పర్యావరణ హితమైన పటాకులు కాల్చేందుకు సుప్రీం కోర్టు అనుమతించడంతో సోమవారం సాయంత్రం ఢిల్లీలో



ప్రజలు పెద్దఎత్తున మోత మోగించారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, కోర్టు ఆదేశాలను ప్రజలు పట్టించుకోలేదు. దీంతో రాత్రికి రాత్రే గాలి నాణ్యత మరింత క్షీణించింది. వాజీపూర్‌లో ఏక్యూఐ 435గా నమోదవగా, ద్వారకా 422, అశోక్ విహార్ 445, ఆనంద్ విహార్ 440 పాయింట్లుగా నమోయింది. దీంతో ఈ ప్రాంతాలు రెడ్ జోన్‌లో ఉన్నాయి.గాలి న్యాణ్యత సూచీ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి కాలుష్యం లేదని.. అదే 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని.. ఇక 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఏక్యూఐ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ చెబుతున్నది. వాయు కాలుష్యం నేపథ్యంలో 2020 నుంచి దేశ రాజధానిలో దీపావళికి పటాకులు కాల్చడంపై నిషేధం అమల్లో ఉన్నది. అయితే ప్రభుత్వం మారడంతో ఈ బ్యాన్‌ను ఎత్తివేశారు.

## పాకిస్థాన్‌లో దీపావళి వేడుకలు.. వీడియో వైరల్



**ఢిల్లీ**

పాకిస్తాన్‌లో హిందూ సమాజం దీపావళి పండుగను ఘనంగా జరుపుకుంది. దీపావళి వేడుకల సందర్భంగా ఆ దేశ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఇంట్లో ప్రత్యేక విందును ఏర్పాటు చేయగా.. ఈ కార్యక్రమంలో హిందూ, క్రైస్తవ సభ్యులతో పాటు ఇతర మతాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ప్రధాన మంత్రి దీపావళి కేక్ కట్ చేసి, ప్రార్థనలు చేసి, హిందూ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## బీహారీలు ఇకపై మోసపోరు : తేజస్వియాదవ్



**పాట్నా (బీహార్)**

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్ విరుచుకుపడ్డారు. ఇటీవల ఇంటర్వ్యూలో హోంమంత్రి అమిత్ షా.. బీహార్‌లో పారిశ్రామికాభివృద్ధికి.. భూమి కొరతే ప్రధాన అడ్డంకిగా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన న్యూస్ నెట్‌వర్క్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈవిధమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో కూడా సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. అమిత్‌షా వ్యాఖ్యలపై తేజస్వి స్పందించారు. 20 సంవత్సరాలు బీహార్‌లో ప్రభుత్వాన్ని నడిపిన తర్వాత కూడా హోంమంత్రి సాకులు చెబుతున్నారు. గుజరాత్‌లో మాత్రమే కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఆ కంపెనీల్లో పనిచేసే కార్మికులు మాత్రం బీహార్‌కు చెందినవారు. బీహారీలు ఇకపై మోసపోకండి అని తేజస్వి యాదవ్ ఆ రాష్ట్ర ప్రజలకు సూచించారు.

## వాషింగ్టన్‌తో అణు చర్చలు ఉండవు : ఖమేనీ



**టెహ్రాన్**

అణు చర్చలు ప్రారంభిద్దామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ తోసిపుచ్చారు. ఈ ఏడాది జూన్‌లో జరిపిన వైమానిక దాడిలో ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేశామంటూ ట్రంప్ చేసిన వాదనను ఖండిస్తూ 'అలా కలలు కంటూనే ఉండండి' అని ఎద్దేవా చేశారు. తనతో కుదుర్చుకునే ఒప్పందం ఫలితాన్ని అమెరికా ముందుగానే నిర్దేశిస్తోందని, బెదిరింపులకు దిగుతోందని ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇరాన్, అమెరికా దేశాలు ఐదు విడతలుగా పరోక్ష అణు చర్చలు జరిపాయి. జూన్‌లో 12 రోజుల పాటు అమెరికా జరిపిన వైమానిక దాడులతో అవి నిలిచిపోయాయి. ఆ సమయంలో ఇజ్రాయిల్, అమెరికా దళాలు ఇరాన్ అణు స్థావరాలపై బాంబు దాడులు జరిపిన విషయం తెలిసిందే. 'ఒప్పందాన్ని తానే రూపొందిస్తానని ట్రంప్ అంటారు. అయితే బలవంతంగా రుద్దినప్పుడు, దాని ఫలితాన్ని ముందుగానే నిర్ణయించినప్పుడు అది ఒప్పందం ఎలా అవుతుంది? అది బలవంతంగా రుద్దడం లేదా బెదిరించడం అవుతుంది' అని ఖమేనీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు.


## ఈ నెల 24న భారత్ బంద్‌కు పిలుపు

**ఢిల్లీ**



కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా ఈ నెల 23వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ నెల 24న భారత్ బంద్‌కు పిలుపునిస్తూ పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదల చేసింది. కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చింది. కేంద్రంలోని ప్రతిపక్ష పార్టీలు దీనికి మద్దతివ్వాలని కోరింది.

## గూగుల్ ఆఫీసులో నల్లుల బెడద




**ఢిల్లీ**

నల్లులున్నాయి.. ఆఫీసును తాత్కాలికంగా మూస్తున్నాం " అని గూగుల్ సంస్థ తన ఉద్యోగులకు మెయిల్ పంపింది. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం ఇచ్చింది. మాన్‌హట్టన్ చెల్సియా క్యాంపస్‌లోని గూగుల్ ఆఫీసులో నల్లుల బెడద కలిగింది. గూగుల్‌కు చెందిన పర్యావరణ, ఆరోగ్యం, భద్రతాధికారులు ఈనెల 19న తమ ఉద్యోగులకు ఓ ఈమెయిల్‌ను పంపించారు. దాని ప్రకారం.. ఆఫీసులో నల్లుల బెడద ఉన్నట్లు స్నిపర్ డాగ్ గుర్తించిందని తెలిపారు. దీంతో ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆఫీసుకు ఉద్యోగులు రావద్దు అని తెలిపారు. ఈ క్రమంలో నల్లుల నివారణకు కార్యాలయం చర్యలు చేపట్టింది. సోమవారం నుంచి ఆయా ఉద్యోగులు తిరిగి కార్యాలయానికి వచ్చేందుకు అనుమతిచ్చింది. ఇక, నల్లులకు సంబంధించి దురద లాంటి లక్షణాలు ఏమైనా బయటపడితే వెంటనే తెలియజేయాలని కోరింది. తమ ఇళ్లల్లో నల్లులు కన్పిస్తే.. వాటి నివారణకు సంబంధించిన ప్రొఫెషనల్స్‌ను సంప్రదించాలని సూచించింది. న్యూయార్క్‌లోని గూగుల్ ఆఫీసులో పెద్ద మొత్తంలో జంతువుల బమ్మలు ఉంచడం వల్లే ఇది వ్యాపించి ఉండవచ్చని కార్యాలయ వర్గాలు తెలిపాయి. నల్లుల బారినపడి.. ఏవైనా లక్షణాలు కనిపిస్తే దానికి సంబంధించిన నివేదికలు అందజేయాలని ఉద్యోగులకు సూచించింది. దీంతోపాటు పనిచేసే ప్రాంతంలో వాటిని ఎక్కడైనా గుర్తించినట్లయితే తెలిపాలని పేర్కొంది. ఇక, న్యూయార్క్‌లోని గూగుల్ ఆఫీసులో నల్లుల బెడద ఘటన చోటుచేసుకోవడం ఇది రెండోసారి. 2010లో కూడా ఇలాంటిదే జరిగింది.

## యెమెన్ నౌకలో భారతీయులు క్షేమం

### 23మందిని కాపాడిన అధికారులు



**డిజిబౌటి సిటీ**

పేలుడు సంభవించడంతో యెమన్ తీర ప్రాంతంలో మంటల్లో చిక్కుకుపోయిన ఎంవి ఫాల్కన్ నౌక నుండి 23మంది భారతీయులను కాపాడి డిజిబౌటి తీర ప్రాంత రక్షణ దళాలకు అప్పగించారు. కామెరూన్‌కి చెందిన ఆ నౌక డిజిబౌటికి వెళుతుండగా అడెన్ ఓడరేవుకు ఆగేయంగా వున్న సమయంలో ఈ నెల 18న నౌకలో పేలుడు సంభవించింది. ఆ సమయంలో ఎల్‌పిజిని తీసుకెళుతున్న నౌకలో 26మంది వున్నారు. 23మంది భారతీయులతోపాటు ఒక ఉక్రెయిన్ జాతీయుడిని రక్షించారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. నౌక నుండి సహాయం కోరుతూ అభ్యర్థన రాగానే తమ ఫోర్ కమాండర్ నేతృత్వంలో బలగాలు వారిని కాపాడాయని అస్పీడ్స్ అనే రక్షణ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

## పుతిన్-ట్రంప్‌ల భేటీ వాయిదా..?

**ఢిల్లీ**

ఏండ్ల తరబడి సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలని ట్రంప్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఉక్రెయిన్, రష్యా అధ్యక్షులతో ఇప్పటికే పలుమార్లు భేటీ అయ్యారు. దీంతో ఇరుదేశాల మధ్య కొంతమేరకు కాల్పుల విరమణతో ట్రంప్ విజయం సాధించారు. శాశ్వత పరిష్కారం దిశగా ట్రంప్ తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్‌లో మాట్లాడారు. ఆ సమయంలోనే హంగరీలో మరోసారి భేటీ అవ్వాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. అయితే ఈ సమావేశం వాయిదా పడనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా మీడియాలో





కథనాలు వెలువడుతున్నాయి. ఇరుదేశాల అధ్యక్షుల సమావేశానికి ముందు అమెరికా, రష్యా విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, సెర్గీ లావ్రోవ్‌ల మధ్య సమావేశం జరగాల్సి ఉంది. అయితే ఇది నిరవధికంగా వాయిదా పడిందని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అధ్యక్షుల సమావేశానికి సంబంధించి ఏర్పాట్లలో భాగంగా నిర్మాణాత్మక చర్చలు జరిపేందుకుగాను వీరు భేటీ కావాల్సి ఉందని రష్యా తెలిపింది. ఈ సమావేశం నిలిచిపోవడానికి గల కారణాలు స్పష్టంగా తెలియలేదు. ఈ క్రమంలోనే రూబియో, లావ్రోవ్‌లు సోమవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. యుద్ధానికి శాశ్వత పరిష్కారం ఇచ్చేందుకు.. రష్యా, అమెరికాల మధ్య సహకారానికి సంబంధించి ఈ భేటీ ప్రాముఖ్యతను రూబియో చెప్పినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ తెలిపింది.

## వారంలోగా ఆ పని పూర్తిచేయండి..

### అధికారులకు కర్ణాటక సీఎం ఆదేశాలు

**ఢిల్లీ**

బెంగళూరు లో రోడ్ల దుస్థితి గురించి, ట్రాఫిక్ సమస్యల గురించి కొంతకాలంగా కర్ణాటక సర్కారు పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు ఈ సమస్యలను లేవనెత్తారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.వారం రోజుల లోగా బెంగళూరు రోడ్లపై ఉన్న అన్ని గుంతలను పూడ్చేయాలని సీఎం ఆదేశించారు.



నగరంలోని ఐదు కార్పొరేషన్ల పరిధిలోని గుంతల మరమ్మతులకు అక్టోబర్ 31 వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో వైట్ టాపింగ్ సహా రోడ్ల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు రోడ్ల సమస్యలపై గ్రేటర్ బెంగళూరు అథారిటీ చీఫ్ కమిషనర్ మహేశ్వర్ రావు, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ తుషార్ గిరినాథ్ సహా తదితర అధికారులతో చర్చించినట్లు సీఎం తెలిపారు. అయితే ఈ ఏడాది ఎక్కువ వర్షాలు పడడంవల్ల రోడ్లపై పడిన గుంతలను పూడ్చడం ఆలస్యమయ్యిందని పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు కొనసాగుతున్నాయని, వైట్ టాపింగ్ చేయడంవల్ల రోడ్లు 25 నుంచి 30 ఏళ్లపాటు మన్నికగా ఉంటున్నాయని తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్‌కు

# శ్రీరాముడే స్ఫూర్తి

(మొదటి తరువాయి)

ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ది చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.

# మహిళా సాధికారతకు చంద్రబాబ కృషి

(మొదటి తరువాయి)

పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు.

సైబర్ స్టేషన్ల ఏర్పాటు.. సీసీ కెమెరాలు, డ్రోన్లు సైతం ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్ర ప్రజల భద్రత కోసం సీఎం చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న చర్యలపై హోమ్ మంత్రి అనిత ప్రశంసలు కురిపించారు. అంతకు ముందు పోలీస్ అమరవీరులకు సీఎం చంద్రబాబు నాయుడు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అసాంఘిక కార్యకలాపాలకు అండగా భీమవరం డీఎస్పీ




ఫిర్యాదుల విషయాన్ని ప్రస్తావించి అతడి వ్యవహారశైలిపై నివేదిక పంపించాలని ఎస్పీకి పవన్ ఆదేశాలు జారీ చేశారు.అసాంఘిక వ్యవహారాలకు డీఎస్పీ స్థాయి అధికారి అండగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చకుండా చూడాలని ఎస్పీకి ఉపముఖ్యమంత్రి సూచించారు. ఇలాంటి వ్యవహారాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదనే విషయాన్ని సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. ప్రజలందరినీ సమదృష్టితో చూసి శాంతి భద్రతలను పరిరక్షించాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీకి పవన్ కళ్యాణ్ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

# నేటి నుంచి చంద్రబాబు దుబాయ్ పర్యటన

(మొదటి తరువాయి)

ఆహ్వానించనున్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి సీఎం చంద్రబాబు దుబాయ్ వెళ్లనున్నారు. 3 రోజుల్లో వివిధ అంతర్జాతీయ సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులతో వన్ టు వన్ మీటింగులకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. పారిశ్రామికవేత్తలతో పాటు యూఏఈకి చెందిన ప్రభుత్వ ప్రతినిధులతోనూ భేటీ కానున్నారు. రేపు దుబాయ్‌లో సిఐఐ రోడ్ షో కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు. దుబాయ్‌లో మూడవ రోజు ఎపి ఎన్÷-ఆర్‌టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొనున్నారు. తొలి రోజు పర్యటనలో భాగంగా 22వ తేదీ ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో రేపు సీఎం చంద్రబాబు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రియల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులు-షిప్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు చర్చించనున్నారు. అంతేకాకుండా, పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం పలు ప్రాంతాలను సందర్శించనుంది. చంద్రబాబుతో పాటు దుబాయ్ పర్యటనలో మంత్రులు టిజి భరత్, బిసి జనార్థన్ రెడ్డి, సీఎం సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండస్ట్రీస్ సెక్రటరీ యువరాజ్, ఏపీ ఇడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రి రెడ్డి పాల్గొననున్నారు. నవంబర్‌లో నిర్వహించే విశాఖ పార్టనర్షిప్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేందుకు ఇప్పటికే సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ రోడ్ షోలు నిర్వహించారు.

# ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులే

(మొదటి తరువాయి)



వారిని స్మరించుకుంటూ అమరవీరుల సంస్మరణ దినం నిర్విహించు కుంటున్నాం. వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ మనమంతా స్ఫూర్తి పొందుతున్నాం అన్నారు. సమాజంలో అలజడులు ఉంటే పెట్టుబడులు రావు. శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా పనిచేస్తున్నాం. నేరరహిత సమాజం కోసం అందరూ పనిచేయాల్సిన అవసరముందని సిఎం అన్నారు. సాంకేతికంగా పోలీసు శాఖను బలోపేతం చేస్తున్నాం. సైబర్ నేరాలు, వైట్ కాలర్ నేరాలు పెరిగాయి. సీసీ కెమెరాలు, డ్రోన్లు, గూగుల్ టేకౌట్‌లు విస్తృతంగా ఉపయోగించుకోవాలి. పోలీసు యంత్రాంగానికి సీసీ కెమెరాలు మూడో కన్నులా పనిచేస్తాయి. ఎవరు, ఎక్కడ, ఏ తప్పు చేసినా ఆధారాలతో పట్టుకునే పరిస్థితి రావాలి. ఈగల్, శక్తి బృందాల ఏర్పాటుతో రాష్ట్ర పోలీసు వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది. డ్రగ్స్, గంజాయి స్థావరాలను గుర్తించి ధ్వంసం చేస్తున్నాం. స్మగ్లింగ్‌ను పోలీసులు అరికడుతున్నారు. ఎర్రచందనం దొంగల ఆట కట్టిస్తున్నారని అన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడవద్దు ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 192 మంది పోలీసులు అమరులయ్యారు. అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. ప్రజల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలు సైతం పణంగా పెడుతున్న పరిస్థితిని చూస్తున్నాం. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజాన్ని అణచివేయడంలో పోలీసులు మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రజల కోసం పరుగులు పెడుతూ విధులు నిర్వహిస్తున్నారు. తమ సంతోషాన్ని త్యాగం చేసి పోలీసులకు సహకరిస్తున్న కుటుంబసభ్యులకు సెల్యూట్ చేస్తున్నా. పోలీసులంటే కఠినంగా ఉంటారను కుంటారు. కానీ మానవత్వంతో వ్యవహరించేది వాళ్లే. విజయవాడలో పిల్లలు చెప్పులు లేకుండా వెళ్తుంటే పెనమలూరు హెడ్‌కానిస్టేబుల్ చెప్పులు కొనిచ్చారు. ప్రజలు ఆస్తులు కాపాడాలనే తపన పడే సిబ్బంది ఉన్నారు. మానవత్వంతో స్పందించే పోలీసు అధికారులు ఉన్నారని ఈ సందర్భంగా వివరించారు. క్రిమినల్స్ సైబర్ టెక్నాలజీలో అప్డేట్ అవుతున్నారు. వారి కంటే ముందుండకపోతే నేరాలను కట్టడి చేయలేం. గూగుల్ పెట్టుబడులు రాష్ట్రంపై నమ్మకంతోనే విశాఖకు వచ్చాయి. ప్రాణం తాత్కాలికం.. చేసే పని శాశ్వతం. సమాజంలో అశాంతి సృష్టించడానికి రాజకీయ ముసుగులో కొత్త నేరాలు చేస్తున్నారు. రాజకీయ కుట్ర, ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతోంది. సోషల్ మీడియా పెద్ద ఛాలెంజ్‌గా మారింది. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. దీనివల్ల ఎంతో మంది కుమిలిపోతున్నారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం.. నేరస్థులపై కఠినంగా ఉండాలి. శాంతి భద్రతల విషయంలో రాజీ పడవద్దు. నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలి. ప్రభుత్వానికి, ప్రజలకి అండగా ఉండాలి. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. పోలీసులకు బీమా కల్పించి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. హోంగార్డులకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇస్తాం. పోలీసులకు డీఏలతో పాటు సరెండర్ లీవులు ఇస్తున్నాం. 6,100 మంది కానిస్టేబుళ్లను నియమించాం. 2047 నాటికి దేశంలో ఏపీ నంబర్ 1గా ఉండాలి. అన్ని రకాల భద్రత ఉంటేనే ఇది సాధ్యం అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను, వ్యాపారులను బెదిరించడం పేర్ని లక్ష్యం

(మొదటి తరువాయి)




నేత పేర్ని నాని మీద తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా వ్యాపారం చేసుకునే మా కుటుంబంపై నిందలేస్తే ఊరుకునేది లేదు.. బందరు ప్రజలకు అన్యాయం చేయాలని చూసినా, అభివృద్ధి అడ్డుకున్నా తగిన బుద్ధి చెబుతాం అంటూ మంత్రి రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. 'పేర్ని నాని రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ప్రజల్ని, వ్యాపారుల్ని వేధించడమే పనిగా పెట్టుకున్నారు. కొనకళ్ల బుల్లయ్య, తాను కలిసి భూములు కొట్టేశామని చెప్పడానికి పేర్నినాని సిగ్గుపడాలి. నానీ.. దమ్ముంటే రా... రాజకీయంగా బందర్ కు నువ్వేం చేశావో. నేనేం చేశానో తేల్చుకుందాం. పిచ్చి పిచ్చిగా వాగి ప్రజల మధ్య విభేధాలు సృష్టించాలనుకుంటే బుద్ధి చెబుతాం.' అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఎలాంటి వ్యాపారాలు లేవని చెప్పుకునే పేర్ని నానికి ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయి..? అంటూ కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. ముడా భూముల్ని అక్రమంగా తవ్వేసి లక్షల ట్రిప్పుల మట్టి తరలించడం వాస్తవం కాదా..? వీటన్నింటి పై దమ్ముంటే చర్చకు రా.. లేదంటే సైలెంట్ గా ఉండు. అంటూ కొల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

# చైనాకు ట్రంప్ వార్నింగ్

(మొదటి తరువాయి)




న్యాయమైన వాణిజ్య ఒప్పంద కుదరకపోతే ఆ సుంకాలు నవంబర్ 1 నుంచి 155 శాతానికి పెరుగుతాయని హెచ్చరించారు. అయితే చైనా పరస్పర రాయితీలు ఇస్తే సుంకాలను తగ్గించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.చాలా దేశాలు అమెరికాను సద్వినియోగం చేసుకుంటున్నాయన్నారు. చైనా మాత్రం అమెరికాను సద్వినియోగం చేసుకోలేకపోతోందన్నారు. ఆ దేశంలోతో అద్భుతమైన వాణిజ్య ఒప్పందం కుదరనుందని భావిస్తున్నా. తద్వారా ఇరు దేశాలకు మాత్రమే కాకుండా ప్రపంచానికి కూడా మంచి జరుగుతుందని వెల్లడించారు. అమెరికాను ఎన్నో దేశాలు గతంలో దోపిడీ చేశాయని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండదన్నారు. అమెరికాను చైనా అరుదైన ఖనిజాలతో బెదిరించిందని, దాన్ని తాను సుంకాలతో తిప్పికొట్టానని చెప్పారు. చైనాతో తాను సత్సంబంధాలను కోరుకుంటున్నానని ట్రంప్ అన్నారు. వచ్చే ఏడాది జనవరిలో చైనాలో పర్యటించాలన్న ఆహ్వానాన్ని అంగీకరించానని చెప్పారు. జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. మరో రెండు వారాల్లో దక్షిణ కొరియాలో ఆయనతో సమావేశం కానున్నట్లు చెప్పారు. కాగా, ఈ నెల 31 నుంచి దక్షిణ కొరియా వేదికగా ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకారం సమావేశం జరుగనుంది. దీనికి ముందే అక్టోబర్ 29, 30 తేదీల్లో ట్రంప్ అక్కడ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ కానున్నారు.

# వేడెక్కిన జూబ్లీహిల్స్ ప్రచారం

(మొదటి తరువాయి)




బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అని ఆయన విమర్శించారు. ఈ రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.. ఈ రెండు పార్టీల పాలనలో జూబ్లిహిల్స్ ప్రజలకు ఒరిగిందేమిటి? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదని, అయితే హరీష్ రావు చెప్పగానే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్‌కు మద్దతిస్తే, ఆయన తమ్ముడు బీఆర్ఎస్‌కు వత్తాసు పలుకుతున్నారని, బీజేపీని ఓడించడమే మజ్లిస్ పార్టీ ప్రధాన లక్ష్యమని సంజయ్ వ్యాఖ్యానించారు. జూబ్లిహిల్స్‌లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయడం లేదు? ఈ రెండు పార్టీలతో చేసుకున్న బేరసారాలే నిదర్శనం అని ఆయన అన్నారు. బీజేపీ గెలిస్తేనే కేంద్ర నిధులతో జూబ్లిహిల్స్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కిషన్ రెడ్డి మరిన్ని నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తారు. కానీ కాంగ్రెస్ గెలిస్తే బంజారాహిల్స్ పెద్దమ్మతల్లి స్థలాన్ని మజ్లిస్‌కు ధారాదత్తం చేసేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారని సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పై కోపంతో బీఆర్ఎస్‌కు ఓటేయడం అంటే రెండు పార్టీలకీ బలమిచ్చినట్లేనని అన్నారు. బీజేపీని గెలిపించండి? ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ చీఫ్ రామచందర్ రావు, గౌతమ్ రావు, పాయల్ శంకర్ తదితర నేతలు హాజరయ్యారు.

## సుందర్ పిచాయ్ భారత్‌లో పెట్టుబడులు

(మొదటి తరువాయి)

స్టాలిన్ సర్కార్ పెట్టుబడులు తేలేక పోయిందని ఏఐఏడీఎమ్‌కే విమర్శలు చేస్తోంది. తమిళనాడులో జరుగుతున్న ఈ రచ్చపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశారు. వీడియోలో ఏఐఏడీఎంకే నాయకుడు మాట్లాడుతూ.. 'గూగుల్ కంపెనీ ఆంధ్రాలో పెట్టుబడులు పెడుతోంది. ఆ గూగుల్ కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ మన మధురైకి చెందిన వాడు. ప్రభుత్వం గూగుల్‌కు అవకాశం ఇచ్చి ఉంటే మన రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేవి' అని అన్నారు. దీనిపై అధికార పార్టీ నాయకుడు స్పందిస్తూ..'జయ లలిత నిర్లక్ష్యం కారణంగానే చాలా కంపెనీలు ఆంధ్రాకు వెళ్లిపోయాయి' అని అన్నారు. డీఎంకే, ఏఐఏడీఎంకే నాయకుల కామెంట్లపై నారా లోకేష్ స్పందిస్తూ.. ' సుందర్ పిచాయ్ ఏపీని కాదు.. భారత్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకున్నారు' అని స్పష్టం చేశారు.

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకాయిచి

(మొదటి తరువాయి)

సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. జపాన్ తొలి మహిళా ప్రధాని ఎన్నికైన సానే తకైచికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్-జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తకైచితో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుల విషయంలో ఇరుదేశాల బంధాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

# సంపాదకీయం

## గూగుల్ లాంటి సంస్థలను స్వాగతించాల్సిందే !

హైదరాబాద్ అభివృద్ధి, సైబరాబాద్ సృష్టి ఈ రెండు ఇవాళ తెలంగాణ గతినే మార్చాయి. ఐటి అభివృద్ధితో హైదరాబాద్ ముఖచిత్రమే మారిపోయింది. రియల్ రంగంలో కొత్త పోకడలు వచ్చాయి. ఉమ్మడి ఎపిలో చంద్రబాబు పాలన ఎలా ఉన్నా, ఆయన ఏం చేసాడనే విమర్శలకు పోకుండా పరిశీలిస్తే... ఐటిని విస్తరించ దం కోసం తీసుకున్న నిర్ణయాలు ఇవాళ హైదరాబాద్‌ను అగ్రభాగాన నిలబెట్టాయి. హైటెక్ సిటీ రాకతో సైబరాబాద్ అనూహ్యంగా విస్తరించడం, అనేక దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటు కావడంతో లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొన్ని లక్షల మంది హైదరాబాద్‌లో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి 70శాతం ఆదాయంతోనే తెలంగాణ మనగులుగుతందనడంలో సందేహం లేదు. రియల్ ఎస్టేట్ అనూహ్యంగా విస్తరించింది. ఇది కాదనలేని సత్యం. ఇప్పుడు అమరావతి నిర్మాణం, విశాఖను ఐటి హబ్‌గా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. ఎందుకంటే విడివడ్డ తెలుగు రాష్ట్రం అభివృద్ధి చెందడం తెలుగువారికి గర్వకారణంగా చూడాలి. అమరావతి, విశాఖలు అభివృద్ధి చెందితే అక్కడి స్థానికులకు కూడా లక్షల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. దీనిని రాజకీయాలకు అతీతంగా అందరం స్వాగతించాల్సిందే. వైకాపా ఐదేళ్ల పాలనలో అమరావతినే కాదు, రాజధానిని తుంగలో తొక్కింది. మూడు రాజధానులంటూ అసలు రాజధాని లేకుండా చేశారు. ఇవాళ అదే వైకాప అమరావతిని, గూగుల్ రాకను వ్యతిరేకిస్తోంది. విశాఖలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ రావడం ఎంతో పురోగమిస్తుందని, గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్ స్వయంగా చెప్పారు. గూగుల్ సంస్థ డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికాలోనూ భారత్‌లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రానికి పెట్టుబడు లు వస్తే చంద్రబాబుకు లేదా ఐటీ మంత్రి లోకేశ్‌కు వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉంటుందా లేదా అన్నది ముఖ్యం కాదు. ఎందుకంటే పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ ఐటిరంగ విస్తరణెళి ఇందుకు నిదర్శనం. గూగుల్ సంస్థ రాకను మెచ్చుకోవాల్సిన వైకాపా నేతలు అదేపనిగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గూగుల్ గేమ్‌చేంజర్ అనే చెప్పవచ్చు. హైదరాబాద్ తో పోటీపడేలా విశాఖకు అవకాశాలు ఉన్నాయి. సంక్షేమం పేరిట ప్రభుత్వం అదేపనిగా ఉచిత పథకాలు ప్రవేశ పెట్టడం సరికాదు. ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాలి. ఇలా వచ్చేవారికి తోడ్పాటును అందించాలి. చంద్రబాబుపై నమ్మకంతో ఆంధ్రపద్రేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి మొదలైంది. గూగుల్ నిర్ణయం తర్వాత మరిన్న సంస్థలు రావచ్చు. ఇప్పటికే టిసిఎస్ కూడా తన క్యాంపస్ ప్రారంభించడానికి అంగీకరించింది. ఇదే ఒరవడి కొనసాగితే పెట్టుబడుల వెల్లువపెరుగుతుంది. అయితే జగన్ బృందం గూగుల్ సహా అనేక కంపెనీల రాకపై విమర్శలు చేస్తున్నది. పెట్టుబడులు రావడం, అభివృద్ధి జరగడం అన్నది ఎవరైనా స్వాగతించాల్సిందే. జగన్ అధికారంలో ఉండగా ఇలాంటి సంస్థల రాక అన్నది చూడలేదు. అవినీతిని వ్యవస్థీకృతం చేసిన జగన్, కల్తీ మద్యం, ఊరూపేరు లేని బ్రాండ్లతో విచ్చలవిడి నకిలీ వ్యాపారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి కల్తీ మద్యం అమ్మకాలకు మాఫియా కారణం. దానివెనక రాజకీయ నేతలే ఉంటారు. ఇప్పుడు ఎపిలో పట్టుబడ్డ కల్తీకి రాజకీయ నేతలే అండగా ఉన్నారు. అందుకే కల్తీ సారా, కల్తీ మద్యం తాగి అడపాదడపా అనేకులు మరణిస్తూనే ఉంటారు. ఇప్పుడు కల్తీ మద్యం గురించి గగ్గోలు పెడుతున్న జగన్, ఆయన అనుచరులు గతంలో వారి పాలనలో కల్తీ మద్యం సరఫరా అన్నది ప్రభుత్వ పరంగానే చేశారు. జంగారెడ్డిగూడెంతో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఆ మద్యం తాగి పలువురు మరణించిన విషయం గుర్తించాలి. ములకలచెరువులో కల్తీ వ్యవహారం బయటకు రాగానే బాధ్యులందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రోద్బలంతోనే కల్తీ మద్యం తయారు చేశానని ప్రధాన నిందితుడు జనార్దనరావు చెప్పారు. ఇందులో నిజానిజాలు బయటికి వచ్చేలా కఠినంగా వ్యవహరించాలి. మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కూడా వారి లక్ష్యం కావచ్చు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడంతో పాటు విపక్ష పార్టీగా వైకాపా అభివృద్ధిని కూడా స్వాగతించాలి. కానీ గూగుల్ లాంటి సంస్తల రాకను తప్పుపట్టడమో, విమర్శించడమో సరికాదు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుపడాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి. అనేక సంస్థలు రావాలి. గూగుల్ రావాలి, టిసిఎస్ ఇతర సంస్థలు రావాలి. ఎపిలో పెట్లుబడులు లక్ష్యంగా చేపట్టిన సిఐఐ సదస్సును విజయవంతం చేయాలి. అనేక సంస్థలు వచ్చి తమ కార్యలాపాలు సాగించేలా ప్రోత్సహించాలి. అందుకు అందరూ అభినందించాలి. అప్పుడే ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి భరోసా కలుగుతుంది. అంతేకానీ వారిలో అపనమ్మకం కలిగేలా ఎవరు విమర్శలు చేసినా క్షంతవ్యం కాదు. అమెరికాలో తెలుగువారికి ఎసరు పెడుతున్న ట్రంప్ చర్యలతో ఇప్పుడక్కడ అనిశ్చితి నెలకొంది. మనవారికి ఇక్కడే ఉద్యోగాలు రావాలంటే గూగుల్ తదితర సంస్థలు రావాలి. అవి పోటీపడి తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడితే మనం అమెరికా తదితరదేశాలకు వెళ్లాల్సిన ఆగత్యం ఉండదు.

# బీహార్‌లో పోటీ నుంచి తప్పుకున్న జేఎంఎం..

## 143 మంది అభ్యర్థులను ప్రకటించిన ఆర్జేడీ



**పాట్నా:**
బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్నప్పటికీ విపక్ష ఇండియా కూటమిలో లుకలుకలు కొనసాగుతూనే ఉన్నాయి. నామినేషన్ల గడువు ముగిసినప్పటికీ కాంగ్రెస్ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌లో సీట్ల పంపకాలపై ఓ స్పష్టత రాలేదు. దీంతో లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ ఆర్జేడీ 143 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ 60 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. సీట్ల సర్దుబాటులో కూటమి పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఝార?ండ్ ముక్తి మోర్చా ఎన్నికల బరి నుంచి తప్పుకుంది. తాము ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించింది. ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగుతామని ప్రకటించిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. కాంగ్రెస్, ఆర్జేడీ రాజకీయ కుట్ర కారణంగానే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.మహాఘట్‌బంధన్' కూటమిలో భాగంగా తమకు సీట్లు దక్కకుండా ఆర్జేడీ, కాంగ్రెస్ కుట్ర పన్నాయని జేఎంఎం ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఝార?ండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీలతో ఉన్న పొత్తును తమ పార్టీ సమీక్షిస్తుందని జేఎంఎం సీనియర్ నేత సుదివ్య కుమార్ తెలిపారు. రాజకీయ కుట్రలో భాగంగా బిహార్ ఎన్నికల్లో జేఎంఎం పోటీ చేయకుండా ఆర్జేడీ, కాంగ్రెస్ అడ్డుకున్నాయని, ఆ పార్టీలే దీనికి బాధ్యత వహించాలన్నారు. వారికి తమ పార్టీ తగిన సమాధానం ఇస్తుందని చెప్పారు. ఆ పార్టీలతో ఉన్న పొత్తును సమీక్షిస్తుందని వెల్లడించారు. మరోవైపు తొలివడతలో భాగంగా పోలింగ్ జరుగనున్న 121 స్థానాల్లో విపక్ష కూటమి నుంచి 125 మంది పోటీలో ఉన్నారు. కూటమిలో సమన్వయ లోపానికి ఇదే నిదర్శనమని ప్రత్యర్థులు పేర్కొంటున్నారు. ఆర్జేడీ అగ్రనే, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ వైశాలి జిల్లాలోని రాఘోపూర్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. కాగా, ఆర్జేడీ 143 మంది అభ్యర్థులను ప్రకటించడంతో మహాఘఠ్‌బంధన్‌లో సీట్ల పంపకాలు కూడా ఓ కొలిక్కి వచ్చినట్లేనని అనుకోవాలి. ఆర్జేడీ 143, కాంగ్రెస్ 55, సీపీఐఎంఎల్ 20, సీపీఐ 6, సీపీఎం 4, వీఐపీ 15 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. అయితే ఇప్పటికే కాంగ్రెస్ 60 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో కొన్ని చోట్ల విపక్ష కూటమిలోని పార్టీల మధ్య పోటీ తప్పడం లేదు. బీహార్‌లో తొలివిడుత నామినేషన్ల గడువు అక్టోబర్ 17న ముగిసింది. అదేవిధంగా రెండో విడతకు సోమవారమే చివరి రోజు. నవంబర్ 6, 11వ తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అదే నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను ప్రకటిస్తారు.

# దేశ చరిత్రలోనే తొలిసారిగా..!


## దీపావళి రోజున రూ.6.05లక్షల కోట్ల అమ్మకాలు..!



**ఢిల్లీ**
ఈ ఏడాది దేశవ్యాప్తంగా దీపావళి అమ్మకాలు రూ.6.05లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందులో రూ.5.40 కోట్ల విలువైన వస్తువ వ్యాపారం.. రూ.65వేల కోట్ల విలువైన సర్వీసెస్ వ్యాపారం జరిగిందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ నివేదికను విడుదల చేసింది. ఇదే ఇప్పటి వరకు దేశ వాణిజ్య చరిత్రలో అతిపెద్ద పండుగగా నిలిచింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానులతో పాటు టైర్-2, టైర్-3 నగరాలతో సహా దేశవ్యాప్తంగా 60 ప్రధాన కేంద్రాల్లో సీఏఐటీ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహించిన సర్వే ఆధారంగా 'డిటైర్డ్ దీపావళి పండుగ అమ్మకాలు 2025' పేరుతో నివేదికను విడుదల చేసింది. సీఏఐటీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు, స్వదేశీ స్వీకరణకు బలమైన బ్రాండ్ అంబాసిడర్‌గా ఎదిగారని నివేదిక చూపిస్తుందని పేర్కొంది.ఇది వ్యాపారులు, వినియోగదారులు ఇద్దరిని అపూర్వమైన రీతిలో ప్రేరేపించిందని అన్నారు. 87శాతం మంది వినియోగదారులు విదేశీ వస్తువుల కంటే భారతీయ వస్తువులను కొనుగోలు చేసేందుకు ఇష్టపడ్డారని.. తత్ఫలితంగా చైనా ఉత్పత్తులకు డిమాండ్ భారీగా తగ్గిందని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే భారత్‌లో తయారైన అమ్మకాలు 25శాతం పెరిగాయని వ్యాపారులు పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా అమ్మకాల్లో కిరాణా, ఎఫ్ఎంసీజీ 12శాతం, బంగారం-వెండి 10శాతం, ఎలక్ట్రానిక్స్ 8శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 7శాతం, రెడీమేడ్ దుస్తులు 7శాతం, గిఫ్ట్ ఐటమ్స్ 7శాతం, హోమ్ డేకర్ 5శాతం, ఫర్నిషింగ్-ఫర్నీచర్ 5శాతం, స్వీట్లు-స్నాక్స్ 5శాతం, వస్త్రాలు 4శాతం, పూజ వస్తువులు 3శాతం, పండ్లు- గింజలు 3శాతం, బేకరీ-మిఠాయిలు 3శాతం, పాదరక్షలు 2శాతం, ఇతర వస్తువులు 19శాతం అమ్మకాలు జరిగాయని క్యాట్ జాతీయ అధ్యక్షుడు బీసీ భారతీయ పేర్కొన్నారు. సేవల రంగం సైతం గణనీయమైన వృద్ధిని సాధించిందని.. రూ.65వేల కోట్ల వాణిజ్యాన్ని సృష్టించిందన్నారు.

# దీపావళికి రాని బోనస్..

## ఉచితంగా టోల్ గేట్లు ఎత్తివేత



**లక్నో -**
దీపావళి బోనస్ వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పండుగ రానే వచ్చింది. కానీ బోనస్ మాత్రం అకౌంట్లలో పడలేదు. దీంతో ఒక్కసారిగా ఉద్యోగులకు చిర్రెత్తింది. డ్యూటీ పక్కన పెట్టి నిరసనకు దిగారు. అంతేకాకుండా అన్ని టోల్ గేట్లు ఎత్తేసి ఉచితంగా వాహనాలను విడిచిపెట్టేశారు. దీంతో ఒక్కసారిగా యాజమాన్యం దిగొచ్చి కాళ్లబేరానికి వచ్చింది. ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ఫతేహాబాద్ టోల్ ప్లాజా ఉంది. ఈ ఎక్స్‌ప్రెస్‌వే జాతీయ రాజధాని ఢిల్లీకి కలుపుతుంది. అయితే దీపావళికి బోనస్ ఇస్తామని యాజమాన్యం టోల్ ఆపరేటర్లకు హామీ ఇచ్చింది. తీరా చూస్తే పండుగ రానే వచ్చింది కానీ బోనస్ మాత్రం అకౌంట్లలో పడలేదు. దీంతో టోల్ ఆపరేటర్లకు చిర్రెత్తి ఆందోళనకు దిగారు. దీంతో యాజమాన్యం సంఘటనాస్థలికి చేరుకుని వేరే ఉద్యోగులను రప్పించింది. వారిని పని చేయకుండా టోల్ ఆపరేటర్లు అడ్డుకున్నారు. దీంతో చేసేదేమీలేక బోనస్ ఇస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగులు శాంతించి విధుల్లో పాల్గన్నారు. ఆదివారం దాదాపు 10 గంటలపాటు టోల్ గేట్లు ఎత్తేయడంతో కేంద్ర ప్రభుత్వానికి లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. " నేను గత ఒక సంవత్సరం నుంచి కంపెనీలో పనిచేస్తున్నాను కానీ వారు మాకు ఎటువంటి బోనస్ ఇవ్వలేదు. మేము చాలా కష్టపడి పనిచేస్తున్నాము. కానీ వారు మాకు జీతాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదు. కంపెనీ ఇప్పుడు సిబ్బందిని భర్తీ చేస్తామని చెబుతోంది కానీ మాకు ఎటువంటి బోనస్ ఇవ్వలేదు. " అని నిరసన ఉద్యోగి ఒకరు వాపోయారు.

# వైట్ హౌస్ ఈస్ట్‌వింగ్ కూల్చివేత

## ట్రంప్ కలల ప్రాజెక్టు కోసం ఆరాటం



**వాషింగ్టన్**
నో కింగ్స్ అంటూ ప్రపంచవ్యాప్తంగా అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేక నిరసనలు ఉధృతమవుతున్నా..ట్రంప్ తీరు అస్సలు మారటం లేదు. తన కలల ప్రాజెక్టు కోసం వైట్‌హౌస్‌లోని పురాతన కట్టడాన్ని కూల్చేశారు. ఇప్పుడు అక్కడ బాల్‌రూమ్ నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వైట్‌హౌస్‌లో ఈస్ట్‌వింగ్ విభాగంలో కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. స్వయంగా ట్రంపే ఈ విషయాన్ని ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. సోమవారం ఈ ఈస్ట్‌వింగ్ లోని ప్రవేశ ద్వారం, కిటికీలను సిబ్బంది కూల్చేశారు. శ్వేతసౌధంలో 25 కోట్ల అమెరికన్ డాలర్ల వ్యయంతో ట్రంప్ ఈ బాల్‌రూమ్ (నృత్యశాల) నిర్మిస్తున్నారు. ఇది వైట్‌హౌస్‌లో ట్రంప్ చేపట్టనున్న అతిపెద్ద నిర్మాణ కార్య క్రమం. దీన్ని ఈస్ట్‌వింగ్ ప్రాంతంలో నిర్మి స్తున్నారు. ఇక్కడ 999 మంది కూర్చొనేందుకు వీలుగా ప్లాన్ చేశారు. ఈ బాల్‌రూమ్ నిర్మాణం 150 ఏండ్లకు పైగా అమెరికా అధ్యక్షుల కల అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో తన సొంత డబ్బును పెట్టుబడిగా పెట్టినట్టు తెలిపారు. దీనికి సంబంధించి అమెరికన్ పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. ఇక, ఈ నిర్మాణం కోసం అనేకమంది ఉదార దేశభక్తులు, గొప్ప అమెరికన్ కంపెనీలు స్వతహాగా నిధులు సమకూరుస్తున్నా యన్నారు. ఇది వైట్‌హౌస్ నిర్మాణానికి అను సంధానంగా ఉన్నప్పటికీ.. దీనికి శ్వేతసౌధంతో సంబంధం లేదని తెలిపారు. వైట్‌హౌస్ రెండు శతాబ్దాలుగా అమెరికా అధ్యక్షుడి చారిత్రక నివాసంగా ఉంది. ఈస్ట్ వింగ్‌ను 1902లో నిర్మించారు.

# హెచ్1బీ వీసా..లక్ష డాల్లర ఫీజు వాళ్లకే




**హైదరాబాద్**
హెచ్1బీ వీసాలో అమెరికా ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇదివరకు లక్ష అమెరికా డాలర్లు ఫీజును ఖరారు చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించిన విషయం తెలసిందే. తాజాగా హెచ్1బీ వీసా మంజూరులో కాస్తా మినహాయింపు ఇచ్చారు.ఇప్పటికే అమెరికాలో చదువుకుంటూ హెచ్1బీ వీసా దరఖాస్తు చేసుకునే వారు లక్ష డాలర్ల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే బయటి దేశాల్లో చదువుకుని అమెరికాలో ఉద్యోగం కోసం హెచ్1బీ వీసాకు దరఖాస్తు చేసుకునే వారు మాత్రం లక్ష డాలర్లు ఫీజు కట్టాల్సిందేనని అమెరికా ఇమిగ్రేషన్ సర్వీస్ తెలిపింది.సెప్టెంబర్ 21న వీసా ఫీజు వెలువడే నాటికే అమెరికాలో ఉన్న వారు ఈ కొత్త ఫీజు కట్టనక్కర్లేదు ). సెప్టెంబర్ 21 తర్వాత వచ్చిన దరఖాస్తులకు మాత్రమే లక్ష డాలర్ల ఫీజు వర్తిస్తుంది. ఈ ఫీజు చెల్లింపుల కోసం ఇప్పటికే ఆన్‌లైన్ సేవలు ప్రారంభించినట్టు అమెరికా ఇమిగ్రేషన్ సర్వీస్ తెలిపింది.

## వై కోట జనసేన యువత ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి చేయూత



**ఓబులవారిపల్లి రూరల్, అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబుల్ వారి పల్లి మండలం వై .కోట లో దీపావళి పండుగ సందర్భంగా వై కోట కువైట్ జనసేన యూత్ మరియు యర్రంశెట్టి హరిబాబు సౌజన్యంతో వై కోట జనసేన యువత ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు రూ.40,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా వై కోట జనసేన కార్యకర్తలు మాట్లాడుతూ దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం మాత్రమే కాదు, సమాజంలో ఉన్న చీకట్లను తొలగించే ప్రయత్నం చేయడం కూడా అని,మనకు ఉన్నదాంట్లో కొంచెం పంచుకుంటే, అది ఎవరి జీవితంలోనైనా వెలుగులు నింపగలదు అని తెలిపారు.జనసేన పార్టీ నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ సేవా భావం, ప్రజల పట్ల ఉన్న కర్తవ్య నిబద్ధతకు ప్రేరణగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని వారన్నారు. సమాజంలో సహాయం అవసరమున్న వారిని గుర్తించి, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.
తమ ఇబ్బందిని గుర్తించి సహాయం అందించిన వై కోట జనసేన యువతకు లబ్ధిదారుల కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన యువత నల్లంశెట్టి కిషోర్, కొండేటి మనోజ్, అంకిపల్లి హరి, కేతంశెట్టి సుబ్రహ్మణ్యం, ఉపేంద్ర, సుమన్, యశ్వంత్ స్థానిక జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హుల్తి లింగేశ్వర స్వామి జాతరకు అందరూ ఆహ్వానితులే



**పతికొండ**
**అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
దీపావళి పండుగ సందర్భంగా పత్తికొండ మండల పరిధిలోనే పెద్దహుల్తి గ్రామంలో వెలసిన ఉల్తి లింగేశ్వర స్వామి జాతర ఘనంగా నిర్వహిస్తున్నట్లు పెద్దహుల్తి గ్రామ సర్పంచ్ కోలంట్ల విజయలక్ష్మి అన్నారు. మంగళవారం విలేకరులకు పత్రిక ప్రకటన ద్వారా మాట్లాడుతూ నేడు బుధవారం మరియు గురువారం రెండు రోజులపాటు జరిగే జాతరకు భక్తాదులు వివిధ రాష్ట్రాల నుండి పెద్దహుల్తి గ్రామంలో జరుగు దీపావళి పండుగ కు వస్తారని తెలియజేశారు కావున ప్రతి ఒక్కరు.హుల్తి లింగేశ్వర స్వాముల మహోత్సవ జాతరకు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే అన్నారు.

## పోలీస్ అమర వీరుల త్యాగం దేశానికి శాశ్వత ప్రేరణ......

**-పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం..**
**-ముఖ్యఅతిథిగా పాల్గొన్న డి.ఎస్.పి మర్రివాడ భార్గవి**



**ఎమ్మిగనూరు అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
ఎమ్మిగనూరు పట్టణ పోలీస్ స్టేషన్ లో అక్టోబర్ 21న పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎస్పి మర్రి వాడ భార్గవి పాల్గొని తలసేమియా భాధిత చిన్నరుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్త దాన శిబిరంలో పట్టణ మరియు గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ సిబ్బంది దాదాపు 50 మంది, మరియు ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు వి యం.రవి కుమార్, మరి కొంతమంది పట్టణ ప్రజలు రక్త దాతలుగా నిలిచారు ఈ సందర్భంగా డిఎస్పి మర్రి వాడ భార్గవి మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో, అంతర్గత భద్రత నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బందిని స్మరించుకునే ఈ రోజు ను దేశవ్యాప్తంగా 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలోని హాట్ స్ప్రింగ్స్ వద్ద భారతీయ సీఆర్పీఎఫ్ దళాలు చైనా సేన దాడిని ఎదుర్కొంటూ వీరోచితంగా పోరాడాయి. ఆ సమయంలో పదిమంది పోలీసులు ప్రాణాలు అర్పించడం వల్ల ఆ రోజు పోలీసు శాఖకు గౌరవప్రదమైన పోలీస్ అమరవీరుల స్మారక దినంగా నిలిచింది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ ఎస్సై, మధుసూదన్ రెడ్డి, ఎస్సై 2 వి.శ్రీనివాసులు గ్రామీణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసులు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎర్రన్న, మరియు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్ , మహిళా పోలీస్ సిబ్బంది, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# "ఇంకెన్నాళ్లు వాల్మీకులకు బానిస సంకెళ్లు"

**-బివిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారెళ్ల అంజి బోయ**
**-వాల్మిక మనోభావాలను దెబ్బతినేలా మాట్లాడితే "ఖబర్దార్"**

**పత్తికొండ అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
రాష్ట్రంలో అగ్ర నాయకులు బోయ వాల్మీకులను కాపుదారులుగా పక్కన పెట్టుకొని బానిసలుగా వాడుకోవడానికి ఇంకెన్నాళ్లు సంకెళ్లు వేస్తారని బివిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారెళ్ళ బోయ అంజి మండిపడ్డారు.మంగళవారం పట్టణంలోనే బివిఎస్ కార్యాలయంలో పత్తికొండ నియోజకవర్గ బోయ వాల్మిక సమితి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి బివిఎస్ పత్తికొండ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన బివిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారెళ్ల బోయ అంజి మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఆయ రాజకీయ పార్టీ నాయకులు వారి సొంత పనులకు వాడుకోని అన్నదమ్ములుగా ఉంటున్న వాల్మీకుల మధ్యన చిచ్చు పెట్టే విధంగా రాజకీయ నాయకులు వాల్మీకులు వాడుకుంటున్నారని అన్నారు.వాల్మీకులకు ఉన్న గుణం నమ్ముకున్న నాయకుల కోసం సొంత కుటుంబాలను వదిలి ప్రాణాలు త్యాగాలు చేస్తుంటే కొంతమంది నాయకులు వాల్మీక కులాన్ని కించపరిచే విధంగా



మాట్లాడడం పద్ధతి కాదని ధ్వజమెత్తారు.వైసిపి పార్టీకి చెందిన చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి పత్తికొండ నియోజకవర్గ పరిదిలో క్రిష్ణగిరి మండలం కోయిలకొండ సహకార సొసైటీ అధ్యక్షుడుగా చిట్యాల బోయ నాగరాజు కు పీఠం వర్ణించడంతో జీర్ణించుకోలేని ప్రదీప్ రెడ్డి బోయ నాగరాజుకు సహకార సొసైటీ అధ్యక్షుడు పదివి ఎందుకు ఇచ్చారు.బోయ కులానికి కాకుండా వివిధ కులాల వారికి ఇచ్చుంటే బాగుండేదేమో అని ప్రదీప్ రెడ్డి ప్రస్తావించడం బోయ వాల్మీకులను కించపరచడమే కాక అణచివేసే విధంగా మాట్లాడడం సమంజసం కాదని అన్నారు.ప్రదీప్ రెడ్డి మీ వెంట నడవడానికి మీకు రక్షణ కల్పించడానికి మీ జెండాలు మోయడానికి మీకోసం ప్రాణాలు అర్పించడానికి బోయలు పనిచేయాలి. వాల్మీకులకు పదవులు వస్తే మాత్రం మీరు ఇతర కులాలకు ఇవ్వాలని చెప్పిడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.మీరు మాట్లాడిన మాటలు తక్షణమే వెనకకు తీసుకోని బోయ వాల్మీకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బోయ వాల్మీకుల సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు.ఏ నాయకుడైనా వాల్మికులను కించపరిచేలా మాట్లాడితే "ఖబర్దార్" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బివిఎస్ జిల్లా అధ్యక్షులు రాముడు,బివిఎస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రాల శీను,పత్తికొండ మండల అధ్యక్షుడు వీరన్న,తుగ్గలి మండల అధ్యక్షుడు వివి.నాయుడు,కోతి కొండ చంద్రన్న,తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**పత్తికొండ అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ప్రతి సంవత్సరం అక్టోబరు 21న జరుపుకుంటారు. మంగళవారం స్థానిక పత్తికొండ పోలీస్ స్టేషన్లో డిఎస్పి వెంకటరామయ్య స్థానిక అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ.జయన్న లు ఆధ్వర్యంలో ముందుగా అమరవీరుల చిత్రపటాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ భారత్-చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్యన ఉన్న వేడి నీటిబుగ్గ (హాట్ స్ప్రింగ్స్) అమర జవానుల త్యాగాలకు ప్రతీకగా మన మధ్య నిలిచి ఉంది.దేశవ్యాప్తంగా విధినిర్వహణలో అసువులుబాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతి ఏడాది



అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం గా పాటించడం పవిత్ర స్థలం నుండే ఆరంభమైంది అన్నారు.మిలటరీ సరిహద్దులను రక్షించే బాధ్యతను కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్ బలగాలు నిర్వర్తించేవి 1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో పంజాబ్ కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా,చైనా రక్షణ బలగాలు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది.ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారు.కానీ భారత జవాన్ల రక్తంతో తడిచిన హాట్ స్ప్రింగ్స్ నెత్తుటి బుగ్గగా మారి పవిత్రస్థలంగా రూపు దిద్దుకుంది. ప్రతి ఏడాదీ అన్ని రాష్ట్రాల పోలీసులతో కూడిన బృందం ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులు అర్పించడం ఆనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు హెడ్ కానిస్టేబుల్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉపసర్పంచ్ కుటుంబానికి బీజేపీ నేతల ఆర్థిక సాయం



**వెల్దండ, అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
వెల్దండ మండల కేంద్రంలో జరిగిన ఓ హృదయస్పర్శక కార్యక్రమం ప్రజల మనసులను తాకింది. భారతీయ జనతా పార్టీకి మూడు దశాబ్దాలుగా క్రమశిక్షణతో సేవలందించిన వెల్దండ గ్రామ మాజీ ఉపసర్పంచ్ చిమ్ముల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి వారి నివాసానికి చేరుకున్నారు. ఆచారి పార్టీ తరఫున తమ వంతు ఆర్థిక సాయంగా లక్ష రూపాయల చెక్కును శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా వారి పిల్లల విద్య కోసం రూ.1,40,000 అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వారి సేవలను గుర్తు చేసుకుంటూ, పార్టీకి ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ శేఖర్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, మోహన్ రెడ్డి, మట్ట పరమేష్ గౌడ్, మట్ట విష్ణు గౌడ్, రవి కుమార్, శ్రీశైలం, దేవేందర్, కొండల్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన తరగతుల అభివృద్ధి బాధ్యతలు స్వీకరించిన భాగ్యవతి

**మంచిర్యాల, అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిగా డి. భాగ్యవతి మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## కోడుమూరులో విద్యుత్ వినియోగదారులపై సైబర్ నెరగాళ్లు వల



**కోడుమూరు అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
కోడుమూరు పట్టణంలో సైబర్ నేరగాళ్లు విద్యుత్ వినియోగదారులపై వలపన్నారు. కోడుమూరు పట్టణంలోని మా విజయమ్మ హాస్పిటల్ అలాగే భాష నర్సింగ్ హెూమ్ యాజమాన్యం కు ఫోన్ చేసి మీ విద్యుత్ బిల్లులకు అదనంగా ఏ సి డి బిల్లు కట్టాలంటూ ఒత్తిడి చేశారు. కొంత సమయం కేటాయించాలని అడిగిన కాదు ఇప్పుడే కట్టాలి అని ఫోన్పే ద్వారా అమౌంట్ పంపియాలని తెలపడంతో బాధితులు విద్యుత్ అధికారులను సంప్రదించగా మేము ఎలాంటి అదనంగా బిల్లులు వసూలు చేయడం లేదని అసిస్టెంట్ ఇంజనీర్ మధుసూదన్ తెలిపారు. వినియోగదారులకు ఇలాంటి మోసాలకు గురి కాకుండ జాగ్రత్త పడాలని విద్యుత్ అధికారులు ఇంటి దగ్గరకు వస్తే లేకపోతే విద్యుత్ బిల్లులో వచ్చిన రుసుము మాత్రమే చెల్లించాలని ఆయన తెలిపారు.

## అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**ఆత్మకూరు (అనంతపురం) :**
**అక్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**ఆత్మకూరు మండల కేంద్రంలో మంగళవారం అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించి అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరులకు వీర జవాన్ హనుమంతు విగ్రహంకు పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణరావు సిబ్బంది పాల్గొన్నారు.

# నార్పల అపోలో మెడికల్ స్టోర్ అధిక ధరలపై పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

**నార్పల (అనంతపురం) :**
**క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
మండల కేంద్రమైన నార్పలలోనీ అపోలో మెడికల్ స్టోర్ లో ఒకే రకం అయిన ఔషధానికి (మాత్రలకు) నార్పల అపోలో సిబ్బంది రెండు రకాల ధరలు వేసి వసూలు చేశారు ఒకే రకమైన మాత్రలకు రెండు రకాల బిల్లులు అంటూ శుక్రవారం ప్రజాశక్తి లో మాత్రల ఫోటోలు, బిల్లులతో సహా కథనం వచ్చింది. అపోలో మెడికల్ స్టోర్ దోపిడి పై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏమైనా చర్యలు తీసుకున్నారా ఆ దుకాణాన్ని పరిశీలించారా లేదా అని పలువురు వినియోగదారులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి




ఈబి.దేవికి ఫోన్ చేసిన అసలు స్పందించడం లేదు అని కార్పొరేట్ దుకాణాలతో తమకు వచ్చిన ఇబ్బంది ఎందుకులే అన్న విధంగా అధికారులు ఉండిపోయారని అదే ఎవరైనా గ్రామాల్లో ఆర్.ఎం.పి డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీషనర్ డాక్టర్లు గ్రామీణ ప్రాంత మెడికల్ దుకాణాల పై దాడులు చేసి వీడియోలు, ఫోటోలు తీసుకొని హంగామా సఅష్టించే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కార్పొరేట్ దుకాణాలు ఏ విధంగా వ్యవహరించిన తమకెందుకులే అన్న విధంగా వ్యవహరించడం బాధాకరమని కంచే చేను మేస్తే తాము ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి కార్పొరేట్ సంస్థల పట్ల అధికారుల ఉదాసీన వైఖరే వారు ఇష్టారాజ్యంగా దోపిడీ చేయడానికి కారణమవుతున్నారు.

# పదవి కాలం గడుస్తున్నా పాలకమండలి బోర్డు లేదాయే ?

**ఆత్మకూరు (అనంతపురం)**
**క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
సర్పంచుల పదవి కాలం దగ్గర కొద్ది నెలల్లోనే సర్పంచుల పదవి కాలం దగ్గర కొద్ది నెలల్లోనుండగా ఆత్మకూరు మేజర్ పంచాయతీ కార్యాలయంలో గతంలో మాజీ సర్పంచ్ల పాలకమండలి జాబితా బోర్డు సిద్ధం చేశారే తప్ప, 2019 ఎన్నికల్లో గెలుపొందిన ఆత్మకు మేజర్ పంచాయతీ సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి మేజర్ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికై, ఇక కొద్ది నెలల్లో సర్పంచ్ పదవి కాలం ముగుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు కూడా, గ్రామ పంచాయితీ పాలకమండలి బోర్డు ఏర్పాటు చేయకపోవడానికి



దళిత సర్పంచ్ గా ఎన్నికకావడం పంచాయతీ మండల అధికారుల దఅష్టిలో తప్పేమోనన్న సందిగ్ధత మండలంలోని దళిత నేతల్లో, నాయకుల్లో అసంతఅప్తి వెదజల్లుతోంది. పలుమార్లు సంబంధిత పంచాయతీ అధికారి దఅష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇంతవరకు గ్రామ మేజర్ పంచాయతీ పాలకమండలి జాబితా బోర్డును ఏర్పాటు చేయకపోవడంపై సంబంధిత అధికారి నిర్లక్ష్యానికి నిలువుటద్దమని చెప్పవచ్చు. గ్రామ మేజర్ పంచాయతీ సర్పంచుగా ఎన్నిక కావడం, పంచాయతీ కార్యాలయానికి దరిద్రమా అని ఓ దళిత నాయకులు దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు పంచాయతీ అధికారులు స్పందించి గ్రామ మేజర్ పంచాయతీ పాలకమండలి జాబితా బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

# బహుభాషావేత్త 'జానమద్ది'

**- వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ పి. పద్మ**

**కడప అర్బన్ క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి, అనేక కార్యక్రమాలు నిర్వహించి, సాహితీ పరిమళాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హను మచ్ఛాస్త్రి 101వ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా సిపి బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, పరిశోధనకేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, పరిశోధన కేంద్రం సిబ్బంది కలిసి పరిశోధన కేంద్రం ప్రాంగణంలోని డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కాంస్యవిగ్రహానికి, సమావేశమందిరంలోని జానమద్ది చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళు




లర్పించారు. ఆ తర్వాత ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ కడప నగరంలో సి.పి.బ్రౌన్ సాహిత్యయజ్ఞం జరిపిన ప్రదేశంలో మొట్టమొదటగా బ్రౌన్ స్మారక భవనాన్ని నిర్మించడం విశేషమన్నారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆశయాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం తోడ్పాటుతో పలు నూతన కార్యక్రమాలను చేపట్టి గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడతామన్నారు. హనుమచ్ఛాస్త్రి ఎందరో సాహితీవేత్తల నుండి అరుదైన అనేక గ్రంథాలు సేకరించి, బ్రౌన్ గ్రంథాలయాన్ని ఒక గొప్ప విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రికి తెలుగుతో పాటు కన్నడం, సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉండడం వల్లనే ఆయన పలురకాల రచనలు చేయ గలిగారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం కోసం తన తండ్రి అహర్నిశలు శ్రమించారన్నారు. పాఠశాల విద్యార్థులు మొదలుకొని బస్తర్ ప్రాంతంలోని ఒక రిక్షా కార్మికుడు, ఎంతోమంది దాతలు ఇచ్చిన విరాళాలను సేకరించి గ్రంథాలయాన్ని నిలబెట్టారన్నారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరులకు నివాళులు

**గుంటూరు జిల్లాప్రతినిధి,**
**పల్నాడు జిల్లా క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా మంగళవారం గుంటూరు, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఘన నివాళులర్పించారు. గుంటూరులోని నగరంపాలెం పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు, నగర ప్రముఖులు నివాళుర్పించారు. తొలుత స్మారక స్తూపం వద్ద ఎస్‌పి వకుల్ జిందాల్ పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. సమాజ రక్షణ, ప్రజా శ్రేయస్సు మరియు దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల వీరోచిత త్యాగాలను మనం ఎప్పటికీ మరువలేమని శ్లాఘించారు. ఎండ, వాన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజల భద్రత కోసం కృషి చేస్తున్న ప్రతి పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. నరసరావుపేటలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పీ



బి.కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు ప్రతి ఒక్కరూ నివాళు లర్పించాలన్నారు. ధైర్యం, నిబద్ధత అకింతభావం వల్ల సురక్షితమైన, మెరుగైన సమాజం నిర్మిత మవుతుందని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పోలీసులు సేవలు అనిర్వచనీయమని, పోలీస్ వ్యవస్థ లేని సమాజాన్ని ఊహించలేమని అన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు దేశంలో పోలీసులు నిత్యం పహారాకాస్తున్నారని చెప్పారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా వీర మరణం పొందిన ఒక ఎస్‌ఐ, 8 మంది పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులను సత్కరించారు. గుంటూరు కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జి.వి. రమణమూర్తి, ఎ.హనుమంతు, డిఎస్‌పిలు బి.శ్రీనివాసరావు, అరవింద్, ఏడుకొండలరెడ్డి, అజీజ్, సిఐలు ఎ.శ్రీనివాస్, కిషోర్, వీరయ్య చౌదరి, సింగయ్య, సురేష్, శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, నరసరావుపేట కార్యక్రమంలో అదనపు ఎస్.పి జెవి సంతోష్, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి వి.సత్తిరాజు, సత్తెనపల్లి డీఎస్పీలు ఎం.హనుమంతరావు, సి.వెంకట్రావు, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్ర కార్యదర్శిగా కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య ఎన్నిక.

**-హర్షం వ్యక్తం చేసిన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి**




**కోడుమూరు క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామకృష్ణ స్థానంలో ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. ఒంగోలులో జరిగిన మహాసభల్లో కార్యదర్శి ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం విజయవాడలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో గుజ్జుల ఈశ్వరయ్యను కార్యదర్శిగా ఎన్నుకున్నారు.విద్యార్థి, యువజన సంఘాలు ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ లో చురుకుగా పనిచేసిన, యువ నాయకుడు, పార్టీ పట్ల కమిట్మెంట్, విషయాల పట్ల అవగాహన, పోరాట స్ఫూర్తి, పటమ కలిగిన నేత, ఎడ్యుకేటెడ్, నిగర్వి, అందరితో ఆప్యాయత, మర్యాదగా మెలిగే యువ నాయకుడు మంగళవారం రాష్ట్ర సమితి సమావేశంలో సీపీఐ ఆంధ్ర ప్రదేశ్ నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా గుజ్జుల ఈశ్వరయ్య ఎన్నిక కావడం పట్ల ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి, ఏ ఐ ఎస్ ఎఫ్ కోడుమూరు మండల నాయకులు అల్తాఫ్, వీరేంద్ర, వీరంజినేయులు, మునిస్వామి, హర్షం వ్యక్తం చేయడం జరిగింది.

## అహోబిలంలో కుడా చైర్మన్ ప్రత్యేక పూజలు



**అలగడ్డ క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
ఆళ్లగడ్డ మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం క్షేత్రాన్ని మంగళవారం జిల్లా కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకుని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు కీడాంబి వేణుగోపాల్ స్వామి వారికి స్వాగతం పలికి గోత్రనామాలతో అర్చన చేయించారు. అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి, శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు

## పొంగిపొర్లుతున్న కాలువలు, డ్రైనేజీలు

**ఆళ్లగడ్డ క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
ఆళ్లగడ్డలో ఇవాళ మధ్యాహ్నం సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని కాలువలు, డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. డ్రైనేజీలలోని వర్షపు నీరంతా వక్కిలేరు వద్ద ఉన్న ప్రధాన కాలువలోకి వెళ్లి వకుళ నదిలోకి చేరుతోంది. రోడ్డుపై మొక్కజొన్నలు ఆరబోసుకున్న రైతులు ధాన్యం తడిసిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## అమరుల త్యాగాలకు ఘన నివాళి



**నాగర్‌కర్నూల్,క్టోబర్ 21, (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరుల స్థూపం వద్ద కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా పోలీసు అధికారి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పోలీసు అధికారులు, అమరుల కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళు లర్పించారు."శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు అమూల్యమైనవి. వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి. ప్రజల సంక్షేమానికి శాంతి అవసరం. పోలీసుల సేవలు ప్రతి సందర్భంలో కీలకమైనవి" అని కలెక్టర్ పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించినట్లు తెలిపారు."అమరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం. శాంతి, సామాజిక సమైక్యత కోసం పోలీసు వ్యవస్థ నిరంతరం కృషి చేస్తోంది" అని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉప పోలీసు అధికారి బుర్రి శ్రీనివాసులు, అచ్చంపేట ఉప పోలీసు అధికారి పల్లె శ్రీనివాసులు, కల్వకుర్తి ఉప పోలీసు అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఉప సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, అమరుల కుటుంబాలు పాల్గొన్నారు.

# బిజినెస్

## టాటా మోటార్స్ దూకుడు.
## నెల రోజుల్లో లక్షకుపైగా డెలివరీలతో సరికొత్త రికార్డు..!

భారత్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ టాటా మోటార్స్ సరికొత్త రికార్డును సృష్టించింది. దాదాపు నెల రోజుల్లోనే లక్షకుపైగా కార్లను డెలివరీ చేసింది. నవరాత్రుల నుంచి దీపావళి మధ్యకాలంలో కంపెనీ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసినట్లు వెల్లడించింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి అమ్మకాలు 33శాతం వరకు పెరిగాయని టాటా మోటార్స్ చెప్పింది. జీఎస్టీ తగ్గింపుతో పాటు పండుగ సమయంలో డిమాండ్ కారణంగా అమ్మకాలు భారీగా పెరిగాయి. కంపెనీ యూఎస్‌వీ మోడల్స్‌కు ఫుల్ డిమాండ్ కనిపించింది. ఈ సందర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర మాట్లాడారు. నవరాత్రుల నుంచి దీపావళి మధ్య నెల రోజుల్లో లక్షకుపైగా వాహనాల డెలివరీలతో చారిత్రక మైల్‌స్టోన్ చేరామన్నారు.ఎస్‌యూవీలు ఈ వృద్ధిని ముందుకు నడిపించాయన్నారు. కంపెనీ విక్రయించిన వాహనాల్లో అత్యధికంగా నెక్సాన్ మోడల్‌ను డెలివరీ చేసింది. 38వేల యూనిట్లతో




73శాతం వృద్ధిని నమోదు చేసింది. అలాగే, టాటా పంచ్ 32వేల యూనిట్లతో 29శాతం వృద్ధిని సాధించినట్లు చెప్పింది. ఎస్‌యూవీలతో పాటు ఈవీ విభాగంలోనూ భారీగానే డెలివరీలు చేసింది. నెల రోజుల పండుగ సీజన్ సమయంలో దాదాపు 10వేలకుపైగా ఈవీ కార్లను డెలివరీ చేసినట్లు చెప్పింది. గతేడాదితో పోలిస్తే అమ్మకాలు 37శాతం పెరిగాయని.. ఈ విజయంతో మిగతా కాలంలోనూ మంచి ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నామని.. రాబోయే రోజుల్లో కొత్త మోడల్స్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా సీఈవో తెలిపారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీ అంచనా ప్రకారం.. ఈ సీజన్లో భారీగా అమ్మకాలు జరిగాయి. ధనత్రయోదశి రోజున అన్ని కంపెనీలు కలిసి ఒకేరోజు లక్షకుపైగా వాహనాలను డెలివరీ చేశాయి. మార్కెట్‌లో వీటి విలువ రూ.8500 కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

## స్టాక్ మార్కెట్‌లో స్పెషల్ మూరత్ ట్రేడింగ్..

### లాభాల్లో ముగిసిన సూచీలు..!



భారత స్టాక్ మార్కెట్ ప్రత్యేకంగా మూరత్ ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించింది. దీపావళి పండుగ సందర్భంగా మంగళవారం మూరత్ ట్రేడింగ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. కొత్త హిందూ క్యాలెండర్ సంవత్సరం, విక్రమ్ సంవత్ ప్రారంభాన్ని సూచిస్తుంది. హిందూ క్యాలెండర్ ప్రకారం కొత్త ఆర్థిక సంవత్సరం స్వాగతం పలుకుతూ ఈ మూరత్ ట్రేడింగ్ నిర్వహించే విషయం తెలిసిందే. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ, ఎంసీఎక్స్, ఎన్‌సీడీఈఎక్స్ మూరత్ ట్రేడింగ్ మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రారంభమై 1.45 గంటలకు ముగిసింది. ఆ తర్వాత రియలిస్టెడ్ సెక్యూరిటీల ప్రీ ఓపెన్ సెషన్ 1.30 గంటల నుంచి 1.45 వరకు సాగింది.ఆ తర్వాత సాధారణ మూరత్ ట్రేడింగ్ సెషన్ 1.45 గంటలకు ప్రారంభమై.. 2.45 గంటలకు పూర్తయ్యింది. ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్ 62.97 పాయింట్లు పెరిగి 84.426.34 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25.45 పాయింట్లు పెరిగి 25,868.60 వద్ద ముగిసింది. దాదాపు 2,720 షేర్లు లాభపడ్డాయి. 902 షేర్లు క్షీణించాయి. నిఫ్టీలో సిప్లా, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ లాభపడ్డాయి. అయితే కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మాక్స్ హెల్త్‌కేర్, ఆసియన్ పెయింట్స్ నష్టపోయాయి. మెటల్, మీడియా, టెలికాం ఒక్కొక్కటి 0.3శాతం పెరగ్గా.. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది.

## మళ్లీ పెరిగిన బంగారం ధర.. మంగళవారం తులం ఎంతంటే ??

అటు.. మంగళవారం వెండి ధర మాత్రం స్వల్పంగా తగ్గింది. అక్టోబర్ 21, మంగళవారం నాటి ధరలు పరిశీలిస్తే.. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, విజయవాడ, నెల్లూరు, తిరుపతి, కాకినాడల్లో 24 కేరట్ల బంగారం ధర తులం రూ.1,35,180 రూపాయలుగా ఉంది. 22 కేరట్ల తులం పుత్తడి ధర రూ.1,25,180 రూపాయలుగా ఉంది. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.1,88,000 రూపాయలుగా ఉంది. ఢిల్లీలో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,920 ఉండగా, 22 కేరట్ల 10 గ్రాముల ధర రూ.1,21,850 ఉంది. ముంబైలో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,770 ఉండగా, 22 కేరట్ల 10 గ్రాముల ధర





రూ.1,21,700 ఉంది. చెన్నైలో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,090 ఉండగా, 22 కేరట్ల 10 గ్రాముల ధర రూ.1,22,900 ఉంది. బెంగళూరులో 24 కేరట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,770 ఉండగా, 22 కేరట్ల10 గ్రాముల ధర రూ.1,21,700 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, రాజకీయ అనిశ్చిత నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దీంతో పసిడికి భారీ డిమాండ్ ఏర్పడింది. మరో వైపు వెండి ధరలు కూడా గత కొంతకాలంగా పరుగులు పెడుతున్నాయి. వెండి వినియోగం ఎక్కువ కావడంతో పాటు వెండి ని కూడా సురక్షితమైన పెట్టుబడిగా భావించడంతో వెండి ధరలు రోజు రోజుకీ పై పైకి చేరుకుంటున్నాయి.

# స్పోర్ట్స్

## పాక్‌ను వణికించిన సఫారీలు.. వరుసగా ఐదో విజయం..!

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా జోరు కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు విజయాలతో సెమీస్ చేరిన ఆ జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ప్రేమదాస మైదానంలో వర్షం అంతరాయాల నడుమ సాగిన పోరులో.. పాక్‌పై 150 పరుగుల తేడాతో గెలుపొందింది సఫారీ టీమ్. మొదట కెప్టెన్ లారా వొల్వార్డ్(90), సునే లుస్(61), మరినే కాప్ (68 నాటౌట్)ల విధ్వంసంతో 312 రన్స్ కొట్టిన దక్షిణాఫ్రికా.. ఆ తర్వాత మరినే (3-20) విజృంభణతో పాకిస్థాన్‌ను వణికించింది. వర్షం పదే పదే అడ్డుపడగా.. 20 ఓవర్లలో లక్ష్యాన్ని 234గా సవరించారు. కానీ, పాక్ 83 రన్స్‌కే పరితమైంది.వరల్డ్ కప్‌ను ఓటమితో ఆరంభించిన దక్షిణాఫ్రికా .. వరుస విజయాలతో దూసుకుపోతోంది. బలమైన జట్లకు షాకిస్తూ సెమీస్ చేరిన సఫారీ జట్టు.. ఈసారి ఆల్‌రౌండ్ షోతో పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించింది. దక్షిణాఫ్రికా బ్యాటర్ల విధ్వంసంతో డీలా పడిన పాకిస్థాన్ జట్టుకు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ మునీబా అలీ(5)ని పేసర్ ఖాకా ఔట్ చేసి తొలి బ్రేకిచ్చింది. ఆరంభంలోనే వికెట్ పడడంతో సిద్రా అమిన్ (13), ఒమైమా సోహైల్ (6) జాగ్రత్తగా




ఆడారు. కాస్త కుదురుకున్నాక సిద్రా ఫోర్లతో అలరించింది. అయితే.. 7వ ఓవర్లో మరినే కాప్ రెండు వికెట్లు తీసి పాక్‌ను దెబ్బకొట్టింది. మొదటగా సొహైల్‌ను ఎల్బీగా ఔట్చేసిన తను.. చివరి బంతిని సిద్రాను డగౌట్ చేర్చింది.
మరోసారి తన ప్రతాపం చూపిస్తూ అలియా రియాజ్(3)ను ఔట్ చేసిన కాప్ పాక్‌ను కష్టాల్లోకి నెట్టింది. నాలుగు వికెట్లు పడిన పాక్ జట్టు ఇక కోలుకోవడం కష్టమే అనుకున్నవేళ.. వర్షం మొదలైంది. దాంతో, లక్ష్యాన్ని 299కి కుదించారు. కానీ, వాన మరో రెండు సార్లు అంతరాయం కలిగించగా.. 20 ఓవర్లలో 234గా సవరించారు. కానీ, పాక్ 83 రన్స్‌కే పరిమితమై భారీ ఓటమి మూటగట్టుకుంది.

**దంచికొట్టిన లారా, డీక్లెర్క్**

వరల్డ్ కప్‌లో సెమీస్‌కు దూసుకెళ్లిన దక్షిణాఫ్రికా ఈసారి భారీ స్కోర్‌తో విరుచుకుపడింది. ప్రేమదాస మైదానంలో వర్షం అంతరాయం తర్వాత సఫారీ బ్యాటర్లు పాకిస్థాన్ బౌలర్లను ఊచకోత కోశారు. లారా వొల్వార్డ్(90) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. మరినే కాప్(68 నాటౌట్), సునే లుస్(61)లు అర్ధ శతకాలో రెచ్చిపోయారు. ఆఖర్లో డీక్లెర్క్(41) సిక్సర్ల మోతతో జట్టు స్కోర్ మూడొందలు దాటించింది. వీరందరి వీరబాదుడుతో 40 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 312 రన్స్ కొట్టింది.

## మెరిసిన హెూప్.. సూపర్ ఓవర్లో విండీస్ జయకేతనం

మూడు వన్డేల సిరీస్‌లో వెస్టిండీస్ బోణీ కొట్టింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన రెండో వన్డేలో బంగ్లాదేశ్‌కు షాకిస్తూ.. సూపర్ ఓవర్లలో విండీస్ విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 214 పరుగుల ఛేదనలో షాయ్ హెూప్ సేన.. స్కోర్ సమం చేసింది. దాంతో.. సూపర్ ఓవర్ ఆడించగా మొదట విండీస్ వికెట్ నష్టానికి 10 రన్స్ చేసింది. అనంతరం బంగ్లా వికెట్ కోల్పోయి 9 రన్స్ చేసింది. ఒకేఒక పరుగుతో గెలుపొందిన కరీబియన్ జట్టు సిరీస్‌ను 1-1తో సమం చేసింది.మిర్పూర్‌లో జరిగిన రెండో వన్డేలో విండీస్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. మొదట బంగ్లా సౌమ్యా సర్కార్ (45), రిచర్డ్ హెుసేన్ (39 నాటౌట్) మెరుపులతో 213 రన్స్ చేసింది. ఛేదనలో



ఆతిథ్య జట్టు బౌలర్లను విజృంభణతో విండీస్ ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. ఓపెనర్లు విఫలంకాగా.. కెప్టెన్ షాయ్ హెూప్ (53), కేసీ కార్టీలు (35) రాణించడంతో గెలుపు దిశగా సాగింది. అయితే.. రిషద్ హెుసేన్ (3-42) తిప్పేయడంతో ఆలౌట్ ప్రమాదంలో పడింది.బంగ్లా బౌలర్లు టెయిలెండర్లను కట్టడి చేయడంతో 50 ఓవర్లకు విండీస్ కూడా 213 రన్స్ చేసింది. ఇరుజట్ల స్కోర్లు సమం కావడంతో. అంపైర్లు సూపర్ ఓవర్ ఆడించారు. బంగ్లా తరఫున పేసర్ ముస్తాఫిజుర్.. కరీబియన్ తరఫున అకీల్ హెుసేన్‌లు సూపర్ ఓవర్ వేశారు. ఇరుజట్ల మధ్య అక్టోబర్ 23న మూడో వన్డే జరుగనుంది.

## పంత్ వచ్చేస్తున్నాడు.. ఈసారి ఆటగాడిగా కాదు కెప్టెన్‌గా..!

టెస్టు స్పెషలిస్ట్‌గా ముద్రపడిన భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ వచ్చేస్తున్నాడు. ఈసారి అతడు ఆటగాడిగా కాదు కెప్టెన్‌గా మైదానంలోకి దిగనున్నాడు. అవును.. ఇంగ్లండ్ పర్యటనలో పాదం గాయంతో ఆటకు దూరమైన పంత్ కోలుకొని.. ఫిట్‌నెస్ సాధించాడు. స్వదేశంలో



దక్షిణాఫ్రికా తో జరుగబోయే టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం భారత ఏ జట్టు సారథిగా ఎంపికయ్యాడీ డాషింగ్ బ్యాటర్. సఫారీ ఏ జట్టుతో రెండు నాలుగు రోజుల మ్యాచ్‌కు పంత్ నేతృత్వం వహించనుండగా.. అతడికి డిప్యూటీగా యంగ్‌స్టర్ సాయి సుదర్శన్ వ్యవహరించనున్నాడు.అక్టోబర్ చివరి వారంలో దక్షిణాఫ్రికా ఏ జట్టు రెండు నాలుగు రోజుల మ్యాచ్‌ల కోసం భారత పర్యటనకు రానుంది. దాంతో.. మంగళవారం సెలెక్టర్లు పంత్ సారథిగా పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. తొలి నాలుగు రోజుల మ్యాచ్‌కు జూనియర్ ఆటగాళ్లనే ఎంపిక చేసినా .. రెండో మ్యాచ్‌లో స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు.
కేఎల్ రాహుల్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, అకాశ్ దీప్‌తో పాటు సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్‌లు ఎంపికయ్యారు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 2 వరకూ తొలి మ్యాచ్.. నంబర్ 6 నుంచి 9వ తేదీ వరకూ ఇదే మైదానంలో రెండో మ్యాచ్‌లో భారత ఏ, దక్షిణాఫ్రికా ఏ జట్లు తలపడనున్నాయి. నవంబర్‌లో దక్షిణాఫ్రికా సీనియర్ జట్టు మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం భారత్‌కు రానుంది. నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టు జరుగనుంది. టీమిండియాతో సఫారీ టీమ్ రెండు టెస్టులు, మూడు వన్డేలు, 5 టీ20లు ఆడనుంది.
తొలి నాలుగు రోజుల మ్యాచ్‌కు స్క్వాడ్ : రిషభ్ పంత్(కెప్టెన్, వికెట్ కీపర్), ఆయుష్ మాత్రే, ఎన్.జగదీశన్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్(వైస్ కెప్టెన్), దేవ్‌దత్ పడిక్కల్, రజత్ పాటిదార్, హర్ష్ దుబే, తనుష్ కొతియాన్, మానవ్ సుతార్, అన్షుల్ కంభోజ్, యశ్ ఠాకూర్, ఆయుష్ బదొని, సరన్ష్ జైన్.
రెండో నాలుగు రోజుల మ్యాచ్‌కు స్క్వాడ్ : రిషభ్ పంత్(కెప్టెన్, వికెట్ కీపర్), కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్(వైస్ కెప్టెన్), దేవ్‌దత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, హర్ష్ దూబే, తనుష్ కొతియాన్, ఖలీల్ అహ్మద్, గుర్నూర్ బ్రార్, అభిమన్యు ఈశ్వరన్, ప్రసిధ్ కృష్ణ, సిరాజ్, ఆకాశ్ దీప్.





# స్టన్నింగ్‌గా రష్మికమందన్నా మైసా ఫస్ట్ లుక్..

## మరోసారి పుష్ప 2 విలన్ సందడి

కేజీఎఫ్, పుష్ప 2 సినిమాలతో యాక్టర్‌గా సూపర్ ఫేం సంపాదించాడు కన్నడ యాక్టర్ తారక్ పొన్నప్ప. ప్రత్యేకించి పుష్ప 2లో విలన్‌గా స్టన్నింగ్ పర్‌ఫార్మెన్స్‌తో అదరగొట్టేశాడు. ఈ చిత్రం తర్వాత బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో బిజీ అయిపోయాడు. ఈ టాలెంటెడ్ యాక్టర్ మరో పాన్ ఇండియా ప్రాజెక్టులో నటిస్తున్నాడు. పుష్ప 2 హీరోయిన్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న మైసాలో కీ రోల్‌లో నటిస్తున్నాడు తారక్ పొన్నప్ప.దీపావళి సందర్భంగా మైసా మూవీకి సంబంధించిన స్పెషల్ పోస్టర్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్నట్టు తెలియజేశాడు. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉందన్నాడు తారక్ పొన్నప్ప. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తూ గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమని తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. త్వరలోనే షూటింగ్ మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నాను మరి మైసా సినిమాలో ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# స్పీడ్ పెంచేసిన శ్రీలీల




# బాహుబలి' రీ రిలీజ్.. ఐమాక్స్ వెర్షన్ ట్రైలర్ విడుదల!

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి విజువల వండర్ బాహుబలి సినిమా మళ్లీ రీ రిలీజ్ కాబోతున్న విషయం తెలిసిందే. 'బాహుబలి: ది ఎపిక్' అనే పేరుతో రెండు భాగాలను ఒకే పార్టుగా అక్టోబర్ 31న రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా నుంచి తాజాగా మేకర్స్ ఐమాక్స్ వెర్షన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాను కేవలం రీ-రిలీజ్‌గా కాకుండా, సరికొత్త అనుభూతినిచ్చేలా మెరుగైన సాంకేతిక హంగులతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను ఐమాక్స్ తో పాటు, 4DX, డాల్బీ సినిమా వంటి అత్యాధునిక ప్రీమియం ఫార్మాట్‌లలో విడుదల చేయనున్నారు. రీమాస్టర్డ్ పిక్చర్ మరియు సౌండ్ క్వాలిటీతో ఈ చిత్రం ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇవ్వబోతుంది. మరోవైపు ఈ సింగిల్ వెర్షన్ సినిమా నిడివి దాదాపు 3 గంటల 44 నిమిషాలుగా ఖరారు చేయగా ఇటీవలే సెన్సార్ కూడా పూర్తి చేసుకుంది. ఇక పదేళ్ల తర్వాత బాహుబలి మాయాజాలాన్ని బిగ్ స్క్రీన్‌పై ఐమాక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్‌లలో చూడటానికి ప్రేక్షకులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.







# విరాట్ కర్ణ నాగబంధం విడుదల తేదీ ఫిక్స్.. !

టాలీవుడ్‌లో అభిరుచి ఉన్న దర్శకనిర్మాతల్లో ఒకరు అభిషేక్ నామా. డెవిల్ తర్వాత ఈ ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్ తెరకెక్కిస్తున్న సినిమా నాగబంధం. పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ్ ఆలయాల్లో గుప్త నిధుల ఆవిష్కరణలను స్ఫూర్తిగా అడ్వెంచరస్ మైథలాజికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది.పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్ స్టోరీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. నాగబంధం చిత్రాన్ని 2026 మార్చి 19న ఉగాది కానుకగా విడుదల చేయాలని ఫిక్స్ అయ్యారని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయబోతున్నారట. పెదకాపు సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన విరాట్ కర్ణ ఈ చిత్రంలో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు.ఇస్మార్ట్ భామ నభానటేశ్, ఐశ్వర్య మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్, తారక్ సినిమాస్ బ్యానర్లపై అభిషేక్ నామా, కిశోర్ అన్నపురెడ్డి, లక్ష్మి ఐరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# బ్లాక్ సారీలో మతిపోగొట్టిన ప్రగ్య..

అందం, అభినయం ఉన్న అవకాశాలు లేక ఎదురుచూస్తున్న భామల్లో ఈ ముద్దుగుమ్మ ఒకరు. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన నటనతోనే కాదు గ్లామర్ తోనూ ప్రేక్షకులను ఆకట్టుకొని ప్రేక్షకులను మెప్పించింది ఈ బ్యూటీ. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు అందికుంటున్నా భామ ప్రగ్య.డేగ అనే సినిమాతో ఈ ముద్దుగుమ్మ ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. తమిళం, తెలుగుతో పాటు హిందీలో కూడా తెరంగేట్రం చేసింది ఈ బ్యూటీ. మిర్చి లాంటి కుర్రాడు సినిమాతో తెలుగు సినీరంగంలోకి అడుగుపెట్టింది. తరువాత క్రిష్ దర్శకత్వంలో వచ్చిన కంచె సినిమాలో నటించింది. కంచె సినిమాలో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసినా కూడా అంతగా పాపులర్ అవ్వలేకపోయింది. సినిమాలతో పాటు చాలా యాడ్స్ లోనూ నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ అఖండ సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.సోషల్ మీడియాలో ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసే ఫోటోలకు మంచి క్రేజ్ ఉంది. ఇదిలా ఉంటే మొన్నామధ్య ప్రగ్యా జైస్వాల్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఓ స్టార్ క్రికెటర్ తో డేటింగ్ చేయాలని ఉంది అంటూ చెప్పుకొచ్చింది ఈ ముద్దుగుమ్మ.

# షూటింగ్ పూర్తి చేసుకున్న శివ కార్తికేయన్ 'పరాశక్తి'



ఇటీవల మదరాసి సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నటుడు శివ కార్తికేయన్ తన తదుపరి ప్రాజెక్ట్ పరాశక్తిని విడుదలకు సిద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. సుధా కొంగర ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా శ్రీలీల హీరోయన్‌గా నటిస్తుంది. రవి మోహన్, అథర్వ, రానా దగ్గుబాటి, బేసిల్ జోసెఫ్ కీలక పాత్రల్లో నటించబోతున్నారు. జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. అయితే తాజాగా ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ షూట్ ర్యాప్ అంటూ ఒక వీడియోను వదిలింది. ఈ చిత్రం పొంగల్ కానుకగా వచ్చే ఏడాది జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (A P) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831